వర్షాలకు రోడ్లు ధ్వంసం

గుంతలు పడి అధ్వానంగా తయారైన వైనం ● వాహనదారులకు తప్పని తిప్పలు


భాగ్యనగర్ కాలనీకి వెళ్లే మెయిన్ రోడ్డు


పీజేఆర్‌నగర్ రోడ్డు


పొంగుతున్న డ్రైనేజీ


ఎల్లమ్మబండ రోడ్డు

హైదర్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగిపొర్లుతూ రోడ్లపైకి చేరుతుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి ఎల్లమ్మబండ వెళ్లే మెయిన్ రోడ్డు, తులసీ వనం, శంషీగూడ చౌరస్తా, పీజేఆర్‌నగర్ రోడ్లతో పాటు భాగ్యనగర్ కాలనీ మెయిన్‌రోడ్డుపై కూడా గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లోంచి వాహనాలు వెళ్లేటపుడు మట్టినీళ్లు వెనకాల వచ్చే వాహనదారులపై పడుతు న్నాయి. వర్షాలు రాక ముందే గుంతలను పూడ్చాల్సిన అధికారులు ఆ దిశగా పనులు చేపట్టకపోవడంతో ఇప్పుడు సమస్య మరింత జఠిలంగా మారిందని ఆయా కాలనీలు, బస్తీల వాసులు చెబుతున్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఆ దిశగా పని చేయడం లేదు. హైడ్రాకు బాధ్యతలు అప్పగించడంతో ఇంజనీరింగ్ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.


నిలిచిన వర్షపు నీరు

కుంగిన సీసీ రోడ్డు


బారికేడ్లతో మూసివేసిన రోడ్డు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్‌లోని డీమార్ట్ రోడ్డును బారికేడ్లతో మూసేశారు. ఈ ఏడాది జనవరిలో భూగర్భ డ్రైనేజీ లైన్ కోసం బీటీ రోడ్డును మధ్యలో తవ్వేశారు. ఆ తర్వాత తవ్విన ఆ రోడ్డును సీసీతో పూడ్చారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో బుధవారం రాత్రి నుంచి ఆ మార్గంలో రాకపోకలు సాగకుండా భారికేడ్లతో మూసేశారు. టూ వీలర్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇప్పటికే జలమండలి, ఇంజనీరింగ్ ఉద్యోగులు రోడ్డును సందర్శించి అక్కడి తాజా పరిస్థితిని ఉన్నతాధి కారులకు నివేదించారు. వర్షాలు ఆగిపోతే అత్యవసర నిధులను ఉపయోగించి మరమ్మతులు చేపట్టాలని అధికారులు అనుకుంటున్నారు.కాగా, గతంలో సీసీ పని చేసిన కాంట్రాక్టర్ చేతనే మళ్లీ పనిచేయించే ఆలోచనలో జలమండలి అధికారులు ఉన్నట్లు తెలిసింది.


కుంగిన సీసీ రోడ్డు


మ్యాన్‌హోల్ వద్ద కుంగిన సీసీ

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు వ్యక్తుల మృతి

● వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు



బానోతు మోహన్ (ఫైల్), సూర్యదేవర నరేంద్ర (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్‌కు చెందిన బానోతు మోహన్ (24) మూసాపేట జనతానగర్‌లో ఉంటూ మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం 10 గంటలకు ఇతను మృతి చెందినట్టు పోలీసులకు బంధువులు ఫిర్యాదు చేశాడు. హెచ్‌ఎంటీ శాతవాహనగర్‌లో నివాసం ఉండే సూర్యదేవర నరేంద్ర (47) వ్యాపారి. ఈనెల 23న రాత్రి 8.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు కుటుంబసభ్యులు తలుపు తట్టగా తీయలేదు. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో డోర్‌ను తెరిచి చూడగా దాని వెనకాల పడిపోయి ఉన్నాడు. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుని భార్య శ్రావణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, ఈ రెండు కేసుల్లో ఇద్దరి మృతి అనుమానాస్పదంగా ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుల్‌మొహర్ పార్కు కాలనీ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న గుల్‌మొహర్‌పార్కు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

హైదర్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుల్‌మొహర్ పార్కు కాలనీలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి పరిధిలోని గుల్‌మొహర్ పార్కు కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. భెల్ చౌరస్తా నుంచి మెహిదీపట్నంకు వెళ్లే పాత ముంబయి రహదారిని విస్తరించాలని, గుల్‌మొహర్‌కాలనీ చౌరస్తాను అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే గాంధీ త్వరలోనే అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖాసీం, సుబ్బారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చండి

● కార్పొరేటర్‌ను కోరిన ప్రభాకర్‌రెడ్డి కాలనీ వాసులు


కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌కు రోడ్డు సమస్యను వివరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి కాలనీ వాసులు

కూకట్‌పల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయించాలని ప్రభాకర్‌రెడ్డి కాలనీ వాసులు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఫతేనగర్ డివిజన్‌లోని ప్రభాకర్‌రెడ్డి నగర్ నుంచి దీన్‌దయాల్‌నగర్ వరకు జలమండలి అధికారులు మంచి నీటి పైప్‌లైన్ వేసేందుకు రోడ్డును తవ్వి వదలివేశారని చెప్పారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా జలమయంగా మారిందని కార్పొరేటర్‌కు తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ సతీష్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే రోడ్డు సమస్యను జలమండలి అధికారులకు తెలిపారు. వెట్ వేస్ట్‌తో రోడ్డు గుంతలు పూడ్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి వివేక్, ప్రభాకర్ రెడ్డి కాలనీవాసులు రామ్‌రెడ్డి, గోపాల్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, కన్నయ్య, రాజ్ కుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి

● ఏఎంఓహెచ్‌కు మోతీనగర్ వాసుల విజ్ఞప్తి


మూసాపేట్ సర్కిల్ ఏఎంఓహెచ్ కార్తీక్‌ను సన్మానిస్తున్న మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

అల్లాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో సమస్యలు పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఏఎంఓహెచ్ కార్తీక్‌ను సొసైటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, మూసాపేట్ డివిజన్ పరిధిలోని మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని శానిటేషన్, వీధుల్లో చెత్త తొలగింపు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. అలాగే, కాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఏఎంఓహెచ్ కార్తీక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారని సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డా. ఎస్‌వీ ప్రసాద్, సభ్యులు రమేశ్ అయ్యంగార్, సీతారామయ్య పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 43, వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జిమిర్చి 65, కాకరకాయ 23, బీరకాయ 23, క్యాబేజీ 18, బీన్స్ 60, క్యారెట్ 40, గోబిపువ్వు 30, దొండకాయ 20, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 28, క్యాప్సికం 65, ఆలుగడ్డ 23, కీర 18, దోసకాయ 15, సొరకాయ 20, పొట్లకాయ 18, కంద 50, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 15-20, అరటికాయ 10-11, చామగడ్డ 26, ముల్లంగి 6-8, చిలగడదుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 16-20, మునగకాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 115, కరివేపాకు 60, పర్వల్ రూ.60, పల్లికాయ 65, లోబా 23, ఆ కాకర కాయ 60. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

● గృహనిర్మాణశాఖ ఎండీ వీపీ గౌతమ్


ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న గృహనిర్మాణశాఖ ఎండీ వీపీ గౌతమ్

కూకట్‌పల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇళ్లను అందిచడమే ప్రభుత్వ ధ్యేయమని గృహనిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఇందిరానగర్, ఎన్టీఆర్‌నగర్, మూసాపేటలోని చిత్తారమ్మ బస్తీ, వడ్డెరబస్తీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో నివసిస్తున్న పేదల ఇళ్లకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మురికి వాడల్లో నివసిస్తున్న పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా సొంత ఇంటిని సమకూర్చాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. జీ ప్లస్ 3 విధానంలో ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కేపీహెచ్‌బీ వేలం భూముల సందర్శన..

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో త్వరలో వేలం వేయనున్న ప్లాట్లను గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్ పరిశీలించారు. కాలనీలోని 2,420, 4,598 చదరపు గజాల ప్లాట్లతో పాటు 7- 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ ప్లాట్లను త్వరలో వేలం వేయనున్నట్టు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చామని, ప్లాట్ల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.




వాన... అయినా తప్పదుగా!



కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో కూకట్‌పల్లి నియోజకవర్గం తడిసి ముద్దవుతోంది. జోరువాన కురుస్తున్నప్పటికీ విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, వ్యాపారులు తదితరులు జర్కిన్లు వేసుకొని, గొడుగులు పట్టుకొని తమ పనులకు వెళ్తున్నారు. వాహనాలపై వెళ్తున్న వారు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాదచారులు రోడ్డుపై చేరిన వరద, బురదతో తీవ్ర అవస్థలు పడ్డారు. కూకట్‌పల్లిలో గురువారం కురిసిన వర్షంలో జనాలు ఇబ్బందిపడ్డ దృశ్యాలివీ.
కూకట్‌పల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి)



లులు మాల్‌లో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

● నేటి నుంచి మూడు రోజులు నిర్వహణ

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): లులు మాల్‌లో ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ ఖదీర్‌షేక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న నాటి జవాన్లను సత్కరిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని ఉచితంగా సందర్శించి సైన్యం గొప్పతానిన్ని తెలుసుకోవాలన్నారు.


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

అల్లాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్ మోతీనగర్‌లోని అవంతీనగర్(ఈస్ట్) నల్ల పోచమ్మ ఆలయంలో సింక్ మాస్టర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపును బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, సింక్ మాస్టర్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథ్, బీజేపీ అల్లాపూర్ డివిజన్ కార్యదర్శి బొంతు హరికృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సంజీత్, దీపక్, దుర్గ, ఆనంద్, సుమన్, శివ, హేమంత్, భాను, సుధాకర్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

అధికారులెక్కడ..?

● పదకొండు దాటినా ఖాళీ కుర్చీలే దర్శనం

● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులోని జలమండలి అధికారుల కార్యాలయాలు.

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులోని హౌసింగ్‌బోర్డు భవనంలో బాలాజీనగర్ సెక్షన్ మేనేజర్ కార్యాలయంతో పాటు డీజీఎం కార్యాలయాలు ఉన్నాయి. తాగు నీటి సరఫరాతో పాటు భూగర్భ డ్రైనేజీ బాధ్యతలు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ చూస్తున్న విషయం తెలిసిందే. గురువారం ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయానికి సెక్షన్ మేనేజర్ వైష్ణవి, డీజీఎం శంషీర్ రాలేదు. చివరకు సిబ్బంది కూడా కార్యాలయానికి రాలేదు. దీంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి సెక్షన్ మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేసినా ఆమె అందుబాటులోకి రాలేదు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి

● అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో ప్రతీ ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ కె. వెంకట్‌రెడ్డి అన్నారు. కొంపల్లిలోని సెల్యూష్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏసీపీ వెంకట్‌రెడ్డి ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరు నెలలకు ఒకసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సిబ్బందికి ఏసీపీ సూచించారు. 74 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ కృష్ణారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని వారు వినతి పత్రంలో కోరారు. కమిషనర్‌ను కలిసి వారిలో పురపాలక సంఘం కాంగ్రెస్ అధ్యక్షుడు బి.ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ దేవేందర్, మాజీ కౌన్సిలర్ శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



షూల పంపిణీలో సీఐ విజయ్ వర్ధన్ తదితరులు

ఉన్న దాంట్లో ఎంతో కొంత దానం చేయాలి

● పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉన్న దాంట్లో ఎంతో కొంత పేదలకు దానం చేయాలని పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్ అన్నారు. కొంపల్లి పురపాల సంఘంలోని దూలపల్లి, కొంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంకల్ప ఫౌండేషన్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్‌సాగర్ మాట్లాడుతూ, గతేడాది జనవరి 26న పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశామని, అప్పట్లో విద్యార్థులకు షూలు కావాలని ఉపాధ్యాయులు చెప్పడంతో గురువారం పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు శివాజిరాజు, శ్రీకాంత్‌గౌడ్, మహేందర్‌సాగర్, ఉపాధ్యాయులు జయమాల కవిత, నాయకులు నర్సింహ, దుర్గా అశోక్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సైన్‌బోర్డులపై ప్రకటనలు..ఆస్పత్రి యాజమాన్యంపై కేసు



సైన్‌బోర్డులపై అతికించిన ఆస్పత్రి పోస్టర్

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రహదారులపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సైన్ బోర్డులపై ఓ ఆస్పత్రి యాజమాన్యం ప్రకటనలు అంటించడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం... కొంపల్లిలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సైన్ బోర్డులపై సెవెన్ ఓక్స్ పెట్ ఆస్పత్రి తమ ప్రకటనలను అతికించింది. ఇది గమనించిన ట్రాఫిక్ పోలీసులు గురువారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇలాఉండగా, వాహనదారుల కోసం రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసే సైన్ బోర్డులు కనిపించకుండా ఎలాంటి ప్రకటనలు అతికించినా, అడ్డుగా బోర్డులు పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌నేత భాస్కర్ తదితరులు

సమస్యలు గాలికి వదిలేసిన ప్రభుత్వం: బీఆర్‌ఎస్

షాపూర్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు నగరంలోని రోడ్లన్నీ జలమయమై ప్రజలు అవస్థలు పడుతున్న సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనాల్సిన జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బందిని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే పనులకు ఉపయోగించడం సిగ్గుచేటని సూరారం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ విమర్శించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను, సమస్యలను గాలికొదిలేసి ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. కార్యక్రమంలో 126 డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు ముకుందరావు, రవికుమార్, బద్దం కిరణ్, డేవిడ్, జైకృష్ణ, శేఖర్, చోటు, శివలు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు



నిజాంపేట అంబేడ్కర్ విగ్రహం చౌరస్తాలో రోడ్డుపై నిలిచి వర్షపు నీరు, ఇబ్బందుల్లో వాహనదారులు



ప్రగతినగర్ ప్రధాన రోడ్డులో భారీగా చేరిన వర్షపు నీరు

● కనిపించని గుంతలు
● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

నిజాంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్, నిజాంపేటల్లోని పలు ప్రధాన రహదారులపై వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డులపై గుంతలు ఏర్పడి, వాటిలో వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులకు గుంతలు సరిగా కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా నిజాంపేట గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డులో ఇప్పటికే పైప్‌లైన్ కోసం గోతులు తవ్వారు. ఈ వర్షానికి వాటిలో నీరు చేరి భారీ గుంతలుగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా అందులో నీరు చేరడంతో ఎక్కడ గుంత ఉందో కనిపించడం లేదు. అదే విధంగా ప్రగతినగర్‌లోని పలు వీధుల్లోని రోడ్లపై వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.

దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికారులు రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రీతిరెడ్డి

ఐటీ సోదాలు అవాస్తవం

● మల్లారెడ్డి విశ్వ విద్యా పీఠ్ వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని మాజీ మంత్రి మల్లారెడ్డి, అతని కుమారుడు భద్రారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఇళ్లపై ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారని వచ్చిన వార్తలు అవాస్తవమని మల్లారెడ్డి విశ్వ విద్యా పీఠ్ వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి అన్నారు. గురువారం పురపాలక సంఘం పరిధిలోని తన నివాసంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2022లో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ పీజీ సీట్ల విషయంలో తమ కళాశాలపై వేసిన కేసు విషయంలో వరంగల్ పోలీసులు తమ ఇంటికి వచ్చి విచారణ నిమిత్తం నోటీసులు అందజేశారన్నారు. ఉదయం 6 గంటలకు పోలీసులు రావడంతో ఐటీ అధికారులు దాడులు చేస్తున్నట్లు ప్రచారం జరిగిందన్నారు. తమ వర్సిటీలో అడ్మిషన్లు అన్నీ సక్రమంగా జరిగాయని, విద్యార్థుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడటంలో మల్లారెడ్డి యూనివర్సిటీ జాగ్రత్తలు తీసుకుంటోందని అన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

‘ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి’

జీడిమెట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు, పెండింగ్ బిల్లులను, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కుత్బుల్లాపూర్ టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్.పురుషోత్తమ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా రంగ సమస్యలు, పెండింగ్ బిల్లులు, డీఏ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే లక్ష్యంలో భాగంగా గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతి పత్రాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు పురుషోత్తమ్, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, సంతోష్, రాజశేఖర్, అరుణ కుమారి, సరస్వతి, సింహాచలం పాల్గొన్నారు.

విద్యుత్ తీగల్లో మంటలు

జీడిమెట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : అపురూపా కాలనీ బుధవారం రాత్రి గాలిదుమారానికి విద్యుత్ తీగల్లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని అర్ధరాత్రి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, అల్ప్రాజోలం, నిందితులను చూపిస్తున్న అధికారులు

ఎక్సైజ్ దాడులు..
గంజాయి, అల్ప్రాజోలం పట్టివేత

పేట్‌బషీరబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు, సిబ్బంది గురువారం వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి 12.5 కిలోల ఎండు గంజాయి, 140 గ్రాముల అల్ప్రాజోలం, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్‌ఫయాజుద్దీన్ తెలిపారు. మహారాష్ట్రలోని పర్లీ-వైద్యనాథ్ ప్రాంతానికి చెందిన మజ్లూమ్ ఖురేషి(39), అబ్దుల్‌రెహాన్ భగవాన్(19)లు బైక్‌పై 10 కిలోల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా కూకట్‌పల్లిలో పట్టుకున్నారు. మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద బాలానగర్ ఫిరోజ్‌గూడకు చెందిన రాగుల సాయికుమార్(26) తన కారులో 2.5 కిలో గంజాయిని తరలిస్తుండగా అరెస్ట్ చేసి కారును సీజ్ చేశారు. కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలారాజ్ వద్ద 140 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ. 7 లక్షల 20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈదాడులను ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాధవయ్య పర్యవేక్షించారు. సీఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.



బస్సు కోసం రోడ్డుపై వేచి చూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

బస్సు షెల్టర్ లేక అవస్థలు

● సమయానికి రాని బస్సులు ● రోడ్లపై తప్పని నిరీక్షణ

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) :స్టాప్‌ల్లో షెల్టర్లు లేక బస్సుల కోసం రోడ్లపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఎదురు చూడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుచిత్రా చౌరస్తాలో బస్టాప్‌లో షెల్టర్ లేదు. దీంతో సుచిత్రా చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ వైపు వచ్చే బస్సుల కోసం గంటల కొద్దీ రోడ్డుపైనే నిలబడి నిరీక్షించాల్సి విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు వాపోతున్నారు. ట్రాఫిక్ జామ్‌లతో నిర్ణీత సమయానికి బస్సులు రాకపోవడం ఒక సమస్య కాగా, ఆర్టీసీలో సిబ్బంది కొరత కారణంగా ఉన్న డ్రైవర్లు, కండక్టర్లకే డబుల్ డ్యూటీలు వేస్తుండటంతో ఎప్పుడు ఏ బస్సు వస్తుందో, ఎప్పుడు రద్దు అవుతుందో తెలియని పరిస్థితి ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు కుత్బుల్లాపూర్‌కు వెళ్లే రోడ్డులో సుచిత్రా చౌరస్తా వద్ద బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయించడంతో పాటు నిర్ణీత సమయాల్లో బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా వెళ్తున్న వాహనదారులు

ప్రమాదాలకు కేరాఫ్‌గా దేవేందర్‌నగర్ చౌరస్తా

● చౌరస్తా చిన్నదిగా ఉండటం, వాహనదారుల రద్దీ అధికంగా ఉండడమే కారణం

గాజులరామారం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : చౌరస్తా చిన్నదిగా ఉండడం, వాహనదారుల రద్దీ అధికంగా ఉండడం వల్ల నిత్యం ప్రమాదాలో చోటు చేసుకుంటున్నాయి. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్ చౌరస్తా వాహనాల తాకిడికి సరిపోవడంలేదు. దుండిగల్ నుంచి షాపూర్‌నగర్‌కు వచ్చే వాహనాలు, మరో వైపు కూకట్‌పల్లి నుంచి ప్రగతినగర్ వైపు వెళ్లే వాహనాలే కాకుండా మహదేవపురం నుంచి దుండిగల్ వైపు వెళ్లే వాహనాలు అధికంగా ఉండడం గాజులరామారం ప్రాంతంలో క్వారీలను నింపేందుకు భారీ టిప్పర్లు రాత్రి సమయంలో రాకపోకలు సాగిస్తుండడం వల్ల ఈ చౌరస్తాలో యూటర్న్ చేసుకునేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు.

గతంలో ప్రగతినగర్ నుంచి షాపూర్‌నగర్‌కు వస్తున్న ఓ కారు ఎదురుగా వచ్చే టిప్పర్‌ను ఈ చౌరస్తా వద్ద తప్పించబోయి ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జు నుజ్జయి అందులో ఉన్న కుటుంబ సభ్యులు ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. అలాగే ద్విచక్రవాహనదారులు దేవేందర్‌నగర్ నుంచి కైసర్‌నగర్ వెళ్తుండగా ఈ చౌరస్తా వద్ద ఎదురుగా వచ్చే బైక్‌లను ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడి గాయపడ్డారు. ఇలా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చౌరస్తాను విస్తరించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

మీసేవ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించండి

● మంత్రి శ్రీధర్‌బాబుకు అసోసియేషన్ నాయకుల వినతి

షాపూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మీసేవ సెంటర్ల ఏర్పాటు కోసం లక్షా 50 వేల రూపాయలు చెల్లించాలన్న నిబంధనను రద్దు చేయాలని తెలంగాణ మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కొత్తపల్లి దయా సాగర్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మొహిన్, ట్రెజరర్ సత్యం తదితరులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబును గురువారం కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడు తూ, మీ సేవ కేంద్రం ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆపరేటర్లకు చెల్లిస్తున్న కమిషన్‌ను ప్రభుత్వం పెంచాలని, సీఎస్‌సీ, ఎస్‌వీ సంస్థతో కుదుర్చుకొన్న మీసేవ సర్వీస్‌ల అవగాహన ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, మీసేవ లాగిన్‌లో ఆర్‌ఓఆర్, 1బీ, పహాణీని తిరిగి చేర్చాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీసేవ నిర్వాహకు లందరికీ 150 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న మీసేవ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



వాజ్‌పాయినగర్ చౌరస్తాలో శిథిలమైన బీటీ రోడ్డు



చెరుకుపల్లి కాలనీలో మ్యాన్‌హోల్ దుస్థితి

నాణ్యతలేని అభివృద్ధి పనులు

● వేసిన కొద్ది రోజులకే ధ్వంసమైన అంతర్గత రోడ్లు, మ్యాన్‌హోళ్లు
● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కుత్బుల్లాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు మచ్చుకైనా కన్పించడం లేదు. రామకృష్ణనగర్ నుంచి పద్మానగర్ ఫేజ్-1కు వెళ్లేందుకు రెండు నెలల క్రితం వేసిన సీసీ రోడ్డు వర్షాలకు అక్కడక్కడా అప్పుడే బీటలు వారింది. కొన్నిచోట్ల కంకర తేలి గుంతలు పడింది. అదే విధంగా అంబేడ్కర్‌నగర్ నుంచి చెరుకుపల్లి కాలనీ పోచమ్మ ఆలయం వైపు వెళ్లే రోడ్డులో 3 నెలల క్రితం మ్యాన్‌హోళ్లను వేయించగా పూర్తిగా శిథిలమయ్యాయి. వాజ్‌పాయినగర్ నుంచి సంజీవయ్యనగర్ వెళ్లే నాలుగు రోడ్ల చౌరస్తాలో నెల రోజుల క్రితమే బీటీ రోడ్డును వేయించగా పూర్తిగా శిథిలమై గుంతలుగా మారింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఆ గుంతల్లో పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెప్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతతో మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



పద్మానగర్ ఫేజ్-1లో శిథిలమైన రోడ్డు

కార్పొరేటర్‌కు ఆహ్వానం



రావుల శేషగిరికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న యువకులు

కుత్బుల్లాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిని న్యూలాల్ బహదూర్ నగర్‌కు చెందిన యువకులు గురువారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాలనీలో జరిగే ఫలహార బండి ఊరేగింపు వేడుకలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

లారీని ఓవర్ టేక్ చేస్తూ మృత్యుఒడికి..

దుండిగల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తున్న యువకుడు ముందు వెళ్తున్న లారీని దాటికొని వెళ్లే క్రమంలో దానిని ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. దుండిగల్ పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన చంద్రప్రకాష్ (24) కుటుంబ సభ్యులతో కలిసి నిజాంపేటలో నివాసం ఉంటూ మేడ్చల్‌లో మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం షాపునకు వెళ్లిన చంద్రప్రకాష్ రాత్రి దుకాణం మూసి 11 గంటల సమయంలో బైక్‌పై నిజాంపేటకు బయలు దేరాడు. మార్గంమధ్యలో బౌరంపేట ప్రాంతంలోని కేఎల్ యూనివర్సిటీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తూ దానిని ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన దుండిగల్ పోలీసులు మృతుని వద్ద లభించిన వివరాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలిలించారు. తండ్రి రాజారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మించారు సరే.. నిర్వహణేదీ?

- అలంకారప్రాయంగా ఫుట్ఓవర్ బ్రిడ్జిలు
- ఎఫ్ఓబీల వద్ద పనిచేయని ఎస్కలేటర్, లిఫ్టులు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పాదచారులు

చందానగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అసమర్థత కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. పాదచారులు రహదారిని దాటేందుకు మియాపూర్, చందానగర్ రహదారిలో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్ఓబీ)లు నిరుపయోగంగా మారాయి. లిఫ్టులు, ఎస్కలేటర్లు లేకపోవడం, కొన్నింటికి లిఫ్, ఎస్కలేటర్ ఉన్నా.. అవి పనిచేయకపోవడంతో జనం వాటిని వాడడం లేదు. వృద్ధులు మెట్లు ఎక్కలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రహదారిని దాటుతున్నారు. అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పాదచారులకు తప్పని తిప్పలు..

పాదచారులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా రోడ్డును దాటేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ఫుట్ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు. ముంబయి జాతీయ రహదారిపై మియాపూర్ నుంచి చందానగర్ వరకు ప్రైవేట్, జీహెచ్ఎంసీ కలిపి 5 ప్రాంతాల్లో ఎఫ్ఓబీలు నిర్మించారు. మియాపూర్, ఆల్విన్ చౌరస్తాల వద్ద రెండు ప్రైవేట్ సంస్థలు నిర్మించగా.. మదీనగూడ, దీప్తిశ్రీనగర్, గంగారం జేపీ సినిమాస్ ముందు మూడు ఎఫ్ఓబీలను జీహెచ్ఎంసీ నిర్మించింది. జీహెచ్ఎంసీ నిర్మించిన ఎఫ్ఓబీలకు ఇరువైపులా ఎస్కలేటర్లు, లిఫ్టులు ఉన్నాయి. ప్రైవేట్ సంస్థలు నిర్మించిన ఎఫ్ఓబీలకు కేవలం లిఫ్టులు మాత్రమే ఉన్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. దాదాపు సంవత్సరం నుంచి ఏ ఒక్క చోట అవి పని చేయడం లేదు. ఎఫ్ఓబీలు పనిచేయకపోవడంతో వృద్ధులు, మహిళలు మెట్లు ఎక్కలేక ఎక్కడ పడితే అక్కడ జాతీయ రహదారి దాటుతున్నారు. నిర్వహణ లోపంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ విషయంపై పలువురు వృద్ధులు ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధి స్పందించలేదు. ప్రస్తుతం మియాపూర్ నుంచి చందానగర్ మీదుగా సంగారెడ్డి వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వృద్ధులు, చిన్నారులు, మహిళలు రోడ్డు దాటేందుకు మరింత ఇబ్బంది ఎదురవుతుంది. తక్షణమే అధికారులు స్పందించి ఎఫ్ఓబీలను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న గంగారం ఫుట్ ఓవర్ బ్రిడ్జి


గంగారం ఎఫ్ఓబీ వద్ద పనిచేయని ఎస్కలేటర్

మెట్లు ఎక్కలేకపోతున్నాం



మియాపూర్- గంగారం వరకు ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వద్ద ఎస్కలేటర్లు, లిఫ్టులు పనిచేయడం లేదు. దీంతో రోడ్డు దాటాలంటే ఇబ్బంది పడుతున్నాం. మెట్లు ఎక్కలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే అధికారులు స్పందించి ఎఫ్ఓబీల వద్ద ఎస్కలేటర్లు, లిఫ్టులను రిపేర్ చేయాలి. ఎఫ్ఓబీల నిర్వహణ కోసం సిబ్బందిని నియమించాలి.

- రామస్వామియాదవ్, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి, శేరిలింగంపల్లి

ఉపయోగంలోకి తీసుకురావాలి



ప్రజల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు. నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారాయి. జాతీయ రహదారి దాటే సమయంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తేవాలి.

- జనార్దన్, చందానగర్ వాసి


అపర్ణ సైబర్ జోన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నల్లగండ్లలోని అపర్ణసైబర్ జోన్ గెటెడ్ కమ్యూనిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రజలకు హామీనిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన అపర్ణసైబర్ జోన్ గెటెడ్ కమ్యూనిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా నివాసితులు స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీలో చెత్త సేకరణ రోజూ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ శిరీష, ఏఎంహెచ్ఓ శ్రీకాంత్‌రెడ్డి, ఏఈ రషీద్, అపర్ణసైబర్ జోన్ గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షురాలు లలిత్‌చౌదరి, రాజీవ్‌సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయండి

- సీపీని కోరిన మాజీ కౌన్సిలర్ రామస్వామి

చందానగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డికాలనీలో పోలీసు ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిని మాజీ కౌన్సిలర్ రామస్వామియాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం సీపీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, పాపిరెడ్డికాలనీ, సందయ్యనగర్, రాజీవ్‌గృహకల్ప, స్వగృహ కాలనీల్లో 40వేల పైచిలుకు జనాభా ఉందని అన్నారు. ఈ ప్రాంతంలో మద్యపానం, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉందని, యువత పెడదారిన పడే అవకాశం ఉందని సీపీకి ఆయన వివరించారు. శాంతి భద్రతలకు దృష్టిలో పెట్టుకుని రాజీవ్ గృహకల్ప సామూహిక భవనం వద్ద లేదా రాజీవ్ గృహకల్ప హనుమాన్ దేవాలయం ముందు గల చౌరస్తాలో పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని సీపీని కోరారు.


చండీ హోమం నిర్వహిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి

ఘనంగా చండీహోమం

చందానగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ఆధ్వర్యంలో గురువారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రధాన అర్చకులు సుదర్శనం సత్యసాయి, కమిటీ సభ్యులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీగణపతి ఆలయంలో లక్ష కుంకుమార్చన

చందానగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని చందానగర్ డివిజన్ శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో నెల రోజుల పాటు లక్ష కుంకుమార్చనతో పాటు విశేష పూజ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఫౌండర్ యువీ రమణామూర్తి తెలిపారు.


ఆషాఢం ముగింపు వేడుకల్లో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

ఘనంగా ఆషాఢ మాసం ముగింపు వేడుకలు

గచ్చిబౌలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో ఆషాఢమాసం ముగింపు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో శ్రీరాంనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రభాకర్‌రెడ్డి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

రోడ్లపై గుంతలు పూడ్చండి

- కార్పొరేటర్‌ను కోరిన ప్రభాకర్‌రెడ్డి కాలనీ వాసులు

కూకట్‌పల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయించాలని ప్రభాకర్‌రెడ్డి కాలనీ వాసులు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఫతేనగర్ డివిజన్‌లోని ప్రభాకర్‌రెడ్డి నగర్ నుంచి దీన్‌దయాల్‌నగర్ వరకు జలమండలి అధికారులు మంచి నీటి పైప్‌లైన్ వేసేందుకు రోడ్డును తవ్వి వదిలివేశారని చెప్పారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా జలమయంగా మారిందని కార్పొరేటర్‌కు తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ సతీష్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే రోడ్డు సమస్యను జలమండలి అధికారులకు తెలిపారు. వెట్ వేస్ట్‌తో రోడ్డు గుంతలు పూడ్చాలని కోరారు. జలమండలి అధికారి వివేక్, ప్రభాకర్‌రెడ్డి కాలనీవాసులు రామ్‌రెడ్డి, గోపాల్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, కన్నయ్య, రాజ్‌కుమార్, విష్ణు పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ తదితరులు

అల్లాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్ మోతీనగర్‌లోని అవంతీ నగర్(ఈస్ట్) నల్ల పోచమ్మ ఆలయంలో సింక్ మాస్టర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపును బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, సింక్ మాస్టర్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథ్, బీజేపీ అల్లాపూర్ డివిజన్ కార్యదర్శి హరికృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సంజిత్, దీపక్, దుర్గ, ఆనంద్, సుమన్, శివ, హేమంత్, భాను, సుధాకర్, చిట్టి పాల్గొన్నారు.

గుల్‌మొహర్‌పార్కు కాలనీ అభివృద్ధికి కృషి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుల్‌మొహర్ పార్కు కాలనీలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి పరిధిలోని గుల్‌మొహర్ పార్కు కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ, బెల్ చౌరస్తా నుంచి మెహిదీపట్నంకు వెళ్లే పాత ముంబయి రహదారిని విస్తరించాలని, గుల్‌మొహర్‌కాలనీ చౌరస్తాను అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే గాంధీ త్వరలోనే అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖాసీం, సుబ్బారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న గుల్‌మొహర్‌పార్కు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు


కొండాపూర్ ఫ్లైఓవర్‌పై వాహనాల రద్దీ


గచ్చిబౌలిలో ట్రాఫిక్ జామ్

ఎడతెరిపిలేని వాన

- జలమయమైన రోడ్లు
- స్తంభించిన ట్రాఫిక్

రాయదుర్గం, చందానగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రధాన ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రాయదుర్గం, గచ్చిబౌలిలోని పలు ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరింది. రోడ్లపై చేరిన నీటిని మాన్‌సూన్, ఎన్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా సిబ్బంది గురువారం మోటర్లతో తొలగించారు. మియాపూర్ నుంచి బేల్ చౌరస్తా, ఐటీ కారిడార్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, హైటెక్‌సిటీ, కొత్తగూడ, ఖాజాగూడ, గౌలిదొడ్డి, శేరిలింగంపల్లి, చందానగర్‌కు వెళ్లే రహదారిలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. అదే విధంగా హఫీజ్‌పేట, కొండాపూర్, బొటానికల్ ఫ్లైఓవర్‌పై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పది నిమిషాల దూరానికి గంట సమయం పడుతుందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మీసేవ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మీసేవ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి శ్రీధర్‌బాబుకు అసోసియేషన్ నాయకుల వినతి

షాపూర్‌నగర్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మీసేవ సెంటర్ల ఏర్పాటు కోసం లక్షా 50 వేల రూపాయలు చెల్లించాలన్న నిబంధనను రద్దు చేయాలని తెలంగాణ మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కొత్తపల్లి దయా సాగర్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మొహిన్, ట్రెజరర్ సత్యం తదితరులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబును గురువారం కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడు తూ, మీ సేవ కేంద్రం ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆపరేటర్లకు చెల్లిస్తున్న కమిషన్‌ను ప్రభుత్వం పెంచాలని, సీఎస్‌సీ, ఎస్‌వీ సంస్థతో కుదుర్చుకొన్న మీసేవ సర్వీస్‌ల అవగాహన ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, మీసేవ లాగిన్‌లో ఆర్ఓఆర్, 1బీ, పహాణిని తిరిగి చేర్చాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీసేవ నిర్వాహకులందరికీ 150 గజాల స్థలాన్ని కేటాయించాలని మీ సేవ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంత్రిని కోరారు.

లారీని ఓవర్ టేక్ చేస్తూ మృత్యుఒడికి..

దుండిగల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళ్తున్న యువకుడు ముందు వెళ్తున్న లారీని దాటికొని వెళ్లే క్రమంలో దానిని ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. దుండిగల్ పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన చంద్రప్రకాష్ (24) కుటుంబ సభ్యులతో కలిసి నిజాంపేటలో నివాసం ఉంటూ మేడ్చల్‌లో మొబైల్‌షాప్ నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం షాపునకు వెళ్లిన చంద్రప్రకాష్ రాత్రి దుకాణం మూసి 11 గంటల సమయంలో బైక్‌పై నిజాంపేటకు బయలు దేరాడు. మార్గ మధ్యలో బౌరంపేట ప్రాంతంలోని కేఎల్ యూనివర్సిటీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తూ దానిని ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన దుండిగల్ పోలీసులు మృతుని వద్ద లభించిన వివరాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలిలించారు. తండ్రి రాజారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి'

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ కృష్ణారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని వారు వినతి పత్రంలో కోరారు. కమిషనర్‌ను కలిసి వారిలో పురపాలక సంఘం కాంగ్రెస్ అధ్యక్షుడు బి.ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ దేవేందర్, మాజీ కౌన్సిలర్ శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు: గృహ నిర్మాణశాఖ ఎండీ గౌతమ్

కూకట్‌పల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇళ్లను అందిచడమే ప్రభుత్వ ధ్యేయమని గృహనిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఇందిరానగర్, ఎన్టీఆర్‌నగర్, మూసాపేటలోని చిత్తారమ్మ బస్తీ, వడ్డెర బస్తీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో నివసిస్తున్న పేదల ఇళ్లకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మురికి వాడల్లో నివసిస్తున్న పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా సొంత ఇంటిని సమకూర్చాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. జీ ప్లస్ 3 విధానంలో ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కేపీహెచ్‌పీ వేలం భూముల సందర్శన..

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో త్వరలో వేలం వేయనున్న ప్లాట్లను గృహ నిర్మాణశాఖ ఎండీ వీపీ గౌతమ్ పరిశీలించారు. కాలనీలోని 2,420, 4,598 చదరపు గజాల ప్లాట్లతో పాటు 7- 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ ప్లాట్లను త్వరలో వేలం వేయనున్నట్టు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చామని, ప్లాట్ల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న గృహనిర్మాణశాఖ ఎండీ వీపీ గౌతమ్

నేడు చందానగర్‌కు గవర్నర్ రాక

చందానగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌లోని గంగారం సుమన్ మహిళ దక్షిత సమితి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో బీఎస్సీ నర్సింగ్ 4వ బ్యాచ్ విద్యార్థులకు కాన్వకేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షురాలు సరోజ్ బజాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని గురువారం ఆమె తెలిపారు.

కనుల పండువగా సీతారామ కల్యాణం

భెల్‌కాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎంఐజీకాలనీలోని రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా కొనసాగింది. అంతకుముందు స్వామివారి తిరునక్షత్రం సందర్భంగా గర్భాలయంలో నిత్య పూజలతో పాటు విశేష అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకట భాస్కర సత్యనారాయణచార్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


మూసాపేట్ సర్కిల్ ఏఎంఓహెచ్ కార్తీక్‌ను సన్మానిస్తున్న మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

కాలనీ సమస్యలు పరిష్కరించండి

- ఏఎంఓహెచ్‌కు మోతీనగర్ వాసుల ఫిర్యాదు

అల్లాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో సమస్యలు పరిష్కరించాలని జీహెచ్ఎంసీ మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఏఎంఓహెచ్ కార్తీక్‌ను సొసైటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, మూసాపేట్ డివిజన్ పరిధిలోని మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని శానిటేషన్, వీధుల్లో చెత్త తొలగింపు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. అలాగే, కాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఏఎంఓహెచ్ కార్తీక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారని సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డా. ఎస్‌వీ ప్రసాద్, సభ్యులు రమేశ్ అయ్యంగార్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో ప్రతీ ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ కె. వెంకట్‌రెడ్డి అన్నారు. కొంపల్లిలోని సెల్యూష్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏసీపీ వెంకట్‌రెడ్డి ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరు నెలలకు ఒకసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సిబ్బందికి ఏసీపీ సూచించారు. 74 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

- వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు


మోహన్ (ఫైల్)


నరేంద్ర (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్‌కు చెందిన బానోతు మోహన్ (24) మూసాపేట జనతానగర్‌లో ఉంటూ మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం 10 గంటలకు అతను మృతి చెందినట్టు పోలీసులకు బంధువులు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో హెచ్ఎంటీ శాతవాహనగర్‌లో నివాసం ఉండే సూర్యదేవర నరేంద్ర (47) ఈ నెల 23న రాత్రి 8.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు కుటుంబసభ్యులు తలుపు తట్టగా తీయలేదు. దీంతో చుట్టు పక్కల వారి సహాయంతో డోర్‌ను తెరిచి చూడగా డోర్ వెనకాల పడిపోయి ఉన్నాడు. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో ఇద్దరి మృతి అనుమానాస్పదంగా ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.